ఆంధ్రజ్యోతి

బిజినెస్

నిజామాబాద్ • గురువారం 23 నవంబరు 2017

andhrajyothibusiness@gmail.com

5 లక్షల మందికి డిజిటల్ నైపుణ్య శిక్షణ

న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్లలో (2020కల్లా) భారత్‌లో 5 లక్షల మందికి డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సోషల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం ఫేస్‌బుక్ వెల్లడించింది. ఇందులో భాగంగా సంస్థ.. ఫేస్‌బుక్ డిజిటల్ ట్రైనింగ్, ఫేస్‌బుక్ స్టార్టప్ ట్రైనింగ్ హబ్స్ పేరుతో వ్యక్తులు, స్టార్టప్‌ల కోసం శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది. "2022కల్లా భారత్ డిజిటల్ ఎకానమీ లక్ష కోట్ల డాలర్లకు (రూ.65 లక్షల కోట్లు) చేరుకోవచ్చని అంచనా. ఇందుకోసం భారత్‌ను సిద్ధపరిచేందుకు అవసరమైన సాధనాలు, పరిజ్ఞానం, నైపుణ్యం సమకూర్చడమే ఉత్తమమైన మార్గం" అని ఫేస్‌బుక్ ప్రోగ్రామ్స్ హెడ్ రితేష్ మెహతా అన్నారు.

బిఎండబ్ల్యు మోటరాడ్ నుంచి రెండు కొత్త బైక్స్

ఇండియా బైక్ వీక్‌లో విడుదల

గుర్గావ్: ఈ నెల 24వ తేదీ నుంచి 25వ తేదీ వరకు గోవాలో జరిగే ఇండియా బైక్ వీక్ (ఐబిడబ్ల్యు)లో బిఎండబ్ల్యు మోటరాడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా సరికొత్త బిఎండబ్ల్యు కె 1600బి, బిఎండబ్ల్యు ఆర్ నైన్‌టి రేసర్‌లను కంపెనీ ఆవిష్కరించనుంది. వీటితోపాటు మరో డజను బైక్‌లను కూడా కంపెనీ ప్రదర్శించనుంది. వీటిలో బిఎండబ్ల్యు ఎస్ 1000 ఆర్‌ఆర్, ఆర్ 1200 ఆర్, ఎస్ 1000 ఆర్, ఆర్ నైన్ టి, ఆర్ నైన్ టి స్క్రాంబర్, ఆర్ 1200 జిఎస్ అడ్వెంచర్, ఆర్ 1200 జిఎస్, ఎస్ 1000 ఎక్స్‌ఆర్, కె 1600 జిటిఎల్, ఆర్ 1200 ఆర్‌టి ఉన్నట్టు కంపెనీ పేర్కొంది.

- త్వరలో సరికొత్త ఆదాయ పన్నుల చట్టం
- ముసాయిదా తయారీకి టాస్క్‌ఫోర్స్

ఇక ప్రత్యక్ష పన్నుల ప్రక్షాళన!

న్యూఢిల్లీ: జిఎస్‌టిని అమల్లోకి తేవడం ద్వారా దేశంలో పరోక్ష పన్నుల స్వరూపాన్ని సమూలంగా మార్చివేసిన కేంద్ర ప్రభుత్వం.. తాజాగా ప్రత్యక్ష పన్నుల ప్రక్షాళనకు పూనుకుంది. 1961లో అమల్లోకి వచ్చిన ప్రస్తుత ఆదాయ పన్నుల చట్టం స్థానంలో సరికొత్త చట్ట ముసాయిదా రూపకల్పనకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఎనిమిదేళ్ల క్రితం కొత్త డైరెక్ట్ టాక్స్ కోడ్ ముసాయిదా రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన పన్ను చట్టాల నిపుణుడు, ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సిబిడిటి) సభ్యులు అరవింద్ మోదీకే మరోసారి బాధ్యతలను అప్పగించింది కేంద్ర ప్రభుత్వం. ఆరుగురు సభ్యులుండే ఈ టాస్క్‌ఫోర్స్‌కు మోదీ అధ్యక్షత వహిస్తారు. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ఈ ప్యానెల్‌కు శాశ్వత ప్రత్యేక ఆహ్వానితుడు. ఆర్థిక వ్యవస్థలో సమకాలీన అవసరాలకు తగ్గట్టుగా డ్రాఫ్ట్‌ను రూపొందించడం ఈ ప్యానెల్ బాధ్యత.

ప్రత్యక్ష పన్నులను (ఇన్‌కమ్ టాక్స్, కార్పొరేట్ టాక్స్) పూర్తిగా సరళీకరించే ఉద్దేశంతోనే కేంద్రం ఈ అడుగు వేసింది. యాభై ఏళ్లకు పైగా పాతబడిన ఆదాయ పన్ను చట్టాలను తిరగరాయాల్సిన అవసరం ఉందని సెప్టెంబరులో జరిగిన పన్ను అధికారుల వార్షిక సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. "ప్రస్తుత చట్టాన్ని సమీక్షించడంతోపాటు ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా సరికొత్త చట్టాన్ని ప్రవేశపెట్టేందు కోసం ముసాయిదాను రూపొందించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం" అని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. అరవింద్ మోదీ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ గిరీష్ అహుజా, ఈవై చైర్మన్ అండ్ రీజినల్ మేనేజింగ్ పార్ట్‌నర్ రాజీవ్ మెమానీ, టాక్స్ అడ్వకేట్ ముకేష్ పటేల్, ఐసిఆర్ఐఐఆర్ కన్సల్టెంట్ మా నసి కేడియా, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి జసి శ్రీవాస్తవ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆరు నెల్లోగా కొత్త ప్రత్యక్ష పన్నుల చట్ట ముసాయిదా నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. ఇతర దేశాల్లో పాటిస్తున్న చట్టాలకు అనుగుణంగా కొత్త చట్టం ఉండనుంది.



మాగ్మా హెచ్‌డిఐ నుంచి
వన్‌హెల్త్ పాలసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మాగ్మా ఫిన్‌కార్ప్, హెచ్‌డిఐ గ్లోబల్ ఎస్ఇ భాగస్వామ్యంతో ఏర్పాటైన మాగ్మా హెచ్‌డిఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ 'వన్‌హెల్త్' పేరుతో ఆరోగ్య బీమా పాలసీని అందుబాటులోకి తెచ్చింది. ఈ పాలసీ ద్వారా పలు రకాల జీవన శైలి వ్యాధులకు కూడా బీమా రక్షణ లభిస్తుందని బుధవారంనాడిక్కడ కంపెనీ డిప్యూటీ సిఇఒ వికాస్ మిట్టల్ తెలిపారు. లేసిక్, బేరియాట్రిక్ సర్జరీ, సైక్రియాట్రిక్ చికిత్సలు వంటి వాటికీ కవరేజీ లభిస్తుందన్నారు. నాలుగు వేరియంట్లలో ఈ పాలసీ అందుబాటులో ఉంటుందని, దీని ద్వారా 2 లక్షల రూపాయల నుంచి 50 లక్షల రూపాయల వరకు బీమా కవరేజీని పొందడానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. మూడేళ్లకాలానికి కూడా ఈ పాలసీని తీసుకోవచ్చని చెప్పారు. ఈ పాలసీ తీసుకున్న తర్వాత పదిహేను రోజుల్లో రద్దు చేసుకునే సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి దాకా తమ కంపెనీ మోటార్, కమర్షియల్ ఇన్సూరెన్స్ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చిందని, ఇప్పుడు హెల్త్ ఇన్సూరెన్స్ ద్వారా వ్యాపారాన్ని మరింతగా పెంచుకోవాలన్న ఉద్దేశంతో ఉన్నామన్నారు. ప్రస్తుతం కంపెనీ మొత్తం వ్యాపారంలో ఆరోగ్య బీమా వాటా 3 శాతం వరకు ఉందని, వచ్చే మూడేళ్ల కాలంలో దీన్ని 20 శాతానికి పెంచుకోవాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం వ్యాపారం 423 కోట్ల రూపాయలుగా ఉందని, ఇందులో మోటార్ ఇన్సూరెన్స్ వాటాయే అధికంగా ఉందని ఆయన తెలిపారు.

గోద్రెజ్ ఉత్పత్తుల ధరలు తగ్గింపు

న్యూఢిల్లీ: జిఎస్‌టి భారం తగ్గడంతో ఉత్పత్తుల ధరలను తగ్గించిన ఎఫ్ఎంసిజి కంపెనీల జాబితాలో తాజాగా గోద్రెజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ కూడా చేరింది. సంస్థ ఉత్పత్తుల రేట్లను 7 నుంచి 10 శాతం మేర తగ్గిస్తున్నట్లు జిసిపిఎల్ తెలిపింది. ఇప్పటికే ఐటిసి, డాబర్, హిందుస్థాన్ యూనిలీవర్, మారికో సంస్థలు ఉత్పత్తుల ధరలను తగ్గించాయి.

హైదరాబాద్‌లో ఐకియా హే స్టోర్స్

కస్టమర్ల పరిచయం కోసం 6 నెలల కాలానికి ఏర్పాటు.. వచ్చే వేసవిలో పూర్తి స్థాయి స్టోర్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్వీడన్‌కు చెందిన హోమ్ ఫర్నీషింగ్ సంస్థ ఐకియా.. హైదరాబాద్‌లో 'ఐకియా హే స్టోర్స్' పేరిట తమ ఉత్పత్తుల ప్రదర్శనకు ఒక స్టోర్‌ను ప్రారంభించింది. వచ్చే వేసవిలో హై దరాబాద్‌లో పూర్తి స్థాయి స్టోర్ ప్రారంభించేలోగా కస్టమర్లకు ఉత్పత్తులు పరిచయం చేయడం, వారికి ప్రత్యక్ష అనుభవం అందుబాటులోకి తేవడం లక్ష్యంగా ఈ స్టోర్‌ను ఏర్పాటు చేశామని కంట్రీ మార్కెటింగ్ మేనేజర్ ఉల్ఫ్ స్మెడ్జ్‌బర్గ్ తెలిపారు. హైదరాబాద్‌లో మలేసియన్ టౌన్‌షిప్ సమీపంలోని ఫోరమ్ మాల్‌లో ఈ స్టోర్‌ను బుధవారం ప్రారంభించారు. తెలంగాణ ఐటి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేష్ రంజన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. హైదరాబాద్ స్టోర్‌లో తాము 8000 ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానున్నామని, తక్కువ బడ్జెట్ జీవుల నుంచి సంపన్నుల వరకు వివిధ వర్గాల కోసం భిన్నమైన ధరల శ్రేణిలో ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని ఉల్ఫ్ చెప్పారు. వెయ్యి ఉత్పత్తులు 200 రూపాయల కన్నా తక్కువ ధరలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

హే స్టోర్ చక్కని ఎగ్జిబిషన్

హైదరాబాద్‌లో తాము ఏర్పాటు చేసిన ఈ హే స్టోర్ చక్కని ఐకియా వస్తుప్రదర్శనశాల, ఐకియా ఉత్పత్తులపై సంపూర్ణ అవగాహనకు దోహదపడుతుందని స్టోర్ మేనేజర్ జూన్ అషీలియా తెలిపారు. ఇందులో లైఫ్ ఎట్ హోమ్ పేరిట ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామంటూ ఇందులో హైదరాబాదీల అభిరుచులకు అనుగుణంగా బెడ్‌రూమ్, కిచెన్, డైనింగ్ ఏరియా, పిల్లల ప్లే ఏరియా ఎలా తీర్చిదిద్దుకోవచ్చునో ప్రదర్శిస్తున్నామని ఆయన చెప్పారు.

రెండు నెలల్లో రిటైల్ పాలసీ

తెలంగాణ ప్రభుత్వం రెండు నెలల్లోగా రిటైల్ ట్రేడ్ పాలసీ ఆవిష్కరించనున్నదని జయేష్ రంజన్ తెలిపారు. రాష్ట్రంలో రిటైల్ విస్తరణకు ఇందులో పలు చర్యలుంటాయని ఆయన అన్నారు. దీని ముసాయిదా ఇప్పటికే సిద్ధమైందని, పలు విభాగాలకు అభిప్రాయాల వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో తుది పాలసీ రూపొందిస్తామని ఆయన తెలిపారు.

ఐకియా స్టోర్‌లోని పిల్లల బొమ్మలను ప్రదర్శిస్తున్న జయేష్ రంజన్

దివాలా చట్టానికి
మరింత పదును

- సవరణలతో త్వరలో ఆర్డినెన్స్: అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ బుధవారం పలు నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా దివాలా చట్టానికి మరింత పదును పెట్టాలని నిర్ణయించింది. సవరణలతో త్వరలోనే ఆర్డినెన్స్ జారీ చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విలేకరులతో చెప్పారు. అయితే గత ఏడాది డిసెంబరు నుంచి అమల్లోకి వచ్చిన దివాలా చట్టానికి ఎలాంటి సవరణలు చేసేది ఆర్థిక మంత్రి వెల్లడించలేదు. దివాలా చట్టం కింద ఎన్‌సిఎల్‌కి చేరిన కంపెనీల ఆస్తులను చేజిక్కించుకునేందుకు కొన్ని కంపెనీల ప్రమోటర్లు ప్రయత్నిస్తున్నారన్న వార్తలతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు.

సిపిఎస్ఇ సిబ్బంది వేతన సవరణ విధానం

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల(సిపిఎస్ఇ) సిబ్బంది వేతన సవరణకు అనుసరించాల్సిన విధానానికి కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయం ఈ సంస్థల్లో పని చేస్తున్న దాదాపు 9.35 లక్షల మంది సిబ్బందిపై ప్రభావం చూపనుంది. ఈ సంస్థల మేనేజ్‌మెంట్లు సంబంధిత కార్మిక సంఘాలతో చర్చించి కొత్త వేతన ఒప్పందాలు కుదుర్చుకుంటాయి.

గుడ్ల ధర పెరుగుదల తాత్కాలికమే

పౌల్ట్రీ పరిశ్రమకు తెలంగాణ పుట్టిల్లు: మంత్రి ఈటల రాజేందర్

పౌల్ట్రీ ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోడి గుడ్ల ధరల పెరుగుదలపై వ్యక్తమవుతున్న ఆందోళనను తెలంగాణ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తోసిపుచ్చారు. ఇది తాత్కాలికమన్నారు. రిటైల్ మార్కెట్లో ఒక్కో గుడ్డు రూ.6.5 నుంచి రూ.7 అమ్ముతున్నా కోళ్ల రైతులకు ఇప్పటికీ సగటున రూ.3.27కి మించి లభించడం లేదన్నారు. రైతులకు గుడ్డుకు కనీసం నాలుగు రూపాయలు లభిస్తే తప్ప పరిశ్రమ మనగలిగే పరిస్థితి లేదన్నారు. హైటెక్స్‌లో మూడు రోజుల పాటు జరిగే పౌల్ట్రీ ఇండియా 2017ను బుధవారం ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. పరిస్థితులు అనుకూలిస్తే వచ్చే ఏడాది మార్చి నాటికిగానీ కోళ్ల రైతులకు గుడ్డుకు నాలుగు రూపాయలు లభించే అవకాశం లేదన్నారు. ఖర్చులు పెరిగి పోవడంతో ప్రస్తుతం ఒక్కో కోడి పెంపకానికి రైతులు రూ.1,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. పెరిగే ఖర్చులకు అనుగుణంగా చికెన్, గుడ్ల ధర పెరగడం లేదన్నారు. మాంసం కోసం పెంచే బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తిలో ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్న తెలంగాణ త్వరలోనే మొదటి స్థానానికి ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌తో మాట్లాడి పౌల్ట్రీ పరిశ్రమ రుణాలకు నాలుగు శాతం వడ్డీ సబ్సిడీ ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. పరిశ్రమ కోరితే మిషన్ భగీరథ కింద పరిశ్రమలకు కేటాయించిన మంచి నీటిలో కొంత భాగం కోళ్ల పరిశ్రమకూ కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు మంత్రి చెప్పారు. పౌల్ట్రీ పరికరాలపై 12-18 శాతంగా ఉన్న జిఎస్‌టి ని ఐదు శాతానికి తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ఆదాయానికి ఏటా రూ.10,000 కోట్ల కుపైగా సమకూరుస్తూ ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న పౌల్ట్రీ రంగాన్ని తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని చెప్పారు. తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, జాతీయ గుడ్ల సమన్వయ సంస్థ (నెక్) జాతీయ ఉపాధ్యక్షుడు సుబ్బరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సెవా పోల్‌కెమ్ నుంచి
రెండు వ్యాక్సిన్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బ్రాయిలర్ కోళ్లలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే రెండు ప్రత్యేక వ్యాక్సిన్లను పుణేకు చెందిన సెవా పోల్‌కెమ్ త్వరలో భారత విడుదల చేయనుంది. పౌల్ట్రీ ఇండియా సదస్సుకు హాజరైన కంపెనీ టెక్నికల్ డైరెక్టర్ మిలింద్ లిమిమాయే విలేకరులతో ఈ విషయం చెప్పారు. ఇందులో 'ట్రాన్స్‌మ్యూన్ ఐబిడి అనే వ్యాక్సిన్ గంబోరా వ్యాధి నుంచి, వెక్టర్‌మునే ఎన్‌డి అనే వ్యాక్సిన్ రానికెట్ అనే జబ్బుల నుంచి కోళ్లకు రక్షణ కల్పిస్తాయని తెలిపారు. అమెరికా, ఫ్రాన్స్‌కు చెందిన కంపెనీల సాంకేతిక సహకారంతో సెవా పోల్‌కెమ్ కంపెనీ ఈ వ్యాక్సిన్లను తయారు చేస్తోంది. 'పెంపకం దశలో కాకుండా హేచరీల్లోనే ఒక రోజు పిల్ల దశలోనే కోళ్లకు ఈ వ్యాక్సిన్లు ఇవ్వవచ్చు. దీంతో పిల్ల దశ నుంచే కోళ్లలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

ఈ సదస్సు స్టార్టప్‌ల రంగానికి ఉషస్సు

భారత్‌తో బలమైన
బంధానికి రుజువు

భారత్, అమెరికా మధ్య బలమైన స్నేహ బంధానికి జిఇఎస్ తిరుగులేని ఉదాహరణగా నిలుస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె, ఆయన ప్రధాన సలహాదారు ఇవాంకా ట్రంప్ పేర్కొన్నారు. ఈ నెల 28న హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న గ్లోబల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌కు ఆమె హాజరవుతున్న విషయం తెలిసిందే. 500 మందితో కూడిన భారీ ప్రతినిధి బృందానికి ఇవాంకా సారథ్యం వహిస్తున్నారు. ఇందులో అత్యధిక శాతం మంది అమెరికాలో స్థిరపడిన భారతీయులుండటం విశేషం.

"అమెరికా ఫస్ట్, మేకిన్ ఇండియా లు రెండూ వేరువేరు. వాటి మధ్య ఎలాంటి సంఘర్షణా లేదు.. ప్రతీదేశమూ తమ పౌరుల అవసరాలు, భవిష్యత్తునే ప్రథమ ప్రాధాన్యాంశంగా చేసుకుంటుంది. అమెరికా ఫస్ట్ అని అంటే మిగిలిన ప్రపంచదేశాలకు తావు లేదు, వాటిని దూరం పెట్టాం అని అర్థం కాదు" అని ఆమె చెప్పుకొచ్చారు.

భారత్‌ను అమెరికాకు గొప్ప స్నేహితురాలిగా, భాగస్వామిగా ఇవాంకా అభివర్ణించారు. ఆర్థిక, భద్రతా రంగాల్లో ఉభయదేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. భారత్ పర్యటన కోసం తాను ఆసక్తితో ఎదురుచూస్తున్నానని, అక్కడ అనేక మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను కలుసుకోవాలన్న ఆశిస్తున్నానని ఆమె చెప్పారు. 2010లో ప్రారంభమైన జిఇఎస్ పరంపరలో ఎనిమిదో సదస్సు ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. తొలిసారిగా మహిళలను ఇతివృత్తంగా తీసుకొని సదస్సును నిర్వహిస్తున్నారు. మహిళల సాధికారత వల్లనే వారి సమాజాలు, దేశాలు కూడా పురోగమిస్తాయన్నదే తమ ప్రభుత్వ విశ్వాసమని కూడా ఇవాంకా తెలిపారు. హైదరాబాద్ జిఇఎస్‌లో పాల్గొంటున్నవారిలో 52.5 శాతం మంది మహిళా ఆంత్రప్రెన్యూర్స్, ఇన్వెస్టర్స్, సిఇఒలు, పారిశ్రామికవేత్తలు ఉంటారని ఆమె చెప్పారు.

కెటిఆర్‌తో ఒకే వేదికపై

ప్రస్తుత సమాచారాన్ని బట్టి ఇవాంకా హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు ఉంటారు. తొలిరోజు చార్మినార్‌తో సహా కొన్ని చారిత్రక ప్రాధాన్యత ఉన్న ప్రాంతాలను సందర్శించే అవకాశం ఉంది. జిఇఎస్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌తో కలిసి ఒకే వేదిక నుంచి ఆమె ప్రసంగిస్తారు. మరునాడు ఉదయం "ఇన్వేషన్స్ ఎట్ వర్క్ ప్లేస్" అనే అంశంపై జరిగే గోష్ఠితో తెలంగాణ ఐటి మంత్రి కెటిఆర్‌తో కలిసి పాల్గొంటారు. ఈ సదస్సులో ఐసిఐసిఐ బ్యాంక్ ఎండి, సిఇఒ చందాకొచ్చార్, చెర్రీ బ్లెయర్ పాల్గొంటున్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): 100కు పైగా దేశాలు.. 1500 పారిశ్రామికవేత్తలు.. అమెరికా, భారత ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యం.. ఈ మూడు అంశాలు చాలు గ్లోబల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ ప్రాధాన్యం తెలిపేందుకు. "మహిళకు తొలి ప్రాధాన్యం.. అందరికీ సౌభాగ్యం" (ఉమెన్ ఫస్ట్.. ప్రాస్పరిటీ ఫర్ ఆల్) ప్రధానాంశంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టార్టప్‌లతో తమదైన ముద్రను ఆవిష్కరించి, జిఇఎస్‌లో పాల్గొంటున్న కొందరు మహిళా పారిశ్రామికవేత్తలు తమ మనోభావాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

సదస్సుకు కొత్తగూడెం వాసి

కొత్తగూడెం: హైదరాబాద్ వేదికగా జరగనున్న ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సుకు కొత్తగూడెంకి చెందిన యువ పారిశ్రామికవేత్త సాయి సుబ్రమణ్యం ఎంపికయ్యారు. 23 ఏళ్ల వయస్సు ఉన్న ఆయన నవభారత్ పాఠశాలలో పదో తరగతి, కృష్ణవేణి కళాశాలలో ఇంటర్మీడియట్, బిట్స్ పిలానీలో ఇంజనీరింగ్ పూర్తిచేశాడు.

మహిళా పారిశ్రామికవేత్తల మనోగతం

విజయగాథలు తెలుసుకునే సువర్ణవకాశం

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కావాల్సింది విజయవంతమైన వారినుంచి స్ఫూర్తి పొందడం. ఇప్పటివరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి సమావేశాలతో అనేకమంది స్ఫూర్తి పొంది విజయవంతమయ్యారు. మేము సైతం చెన్నై, దిల్లీలో నిర్వహించిన గత సమావేశాల్లో పాల్గొని చాలా విషయాలను నేర్చుకున్నాం. మేము చేసిన అనేక లోటుపాట్లను సరిదిద్దుకున్నాం. హైదరాబాద్ జిఇఎస్ సమావేశానికి 170 దేశాల నుంచి విజయవంతమైన పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు వస్తున్నారు. ఇలాంటి సదస్సు మన నగరం ఆతిథ్యమిస్తుందన్న విషయమే ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఇందులో పాల్గొనే ప్రతి ఒక్కరూ గర్వపడాల్సిన విషయం. ఈ సదస్సు మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యంగా నిర్వహిస్తున్నందున మహిళలకు మరింత ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని కలిగించనుంది. ఇది రాష్ట్ర, దేశ స్టార్టప్ రంగంలో ఓ మైలురాయిగా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు. అంతర్జాతీయ సదస్సుతో ప్రపంచవ్యాప్తంగా ఏ రంగాల్లో అవకాశాలున్నాయన్న విషయం తెలుస్తుంది.

సాహిత్యరాజ్, స్నేహరాజ్, కో ఫౌండర్స్ శ్రీయల్ టెక్నాలజీస్
- **వ్యాపారం:** సమగ్ర డిజిటల్ టెక్నాలజీస్ సర్వీసుల సంస్థ
- **చిరునామా:** ఉప్పల్, హైదరాబాద్

శిక్షణ లేకనే విఫలమవుతున్నారు..

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్న వారికి అడ్డంకులు ఎలాగూ ఉంటాయి. ముఖ్యంగా మహిళలకు సమస్యలు మరీ ఎక్కువ. నిరుత్సాహపరచడం సమాజం నుంచి ఎదురవుతున్న అతిపెద్ద సమస్య. చేయగలదా లేదా అన్న అనేక సందేహాలుంటాయి. కుటుంబం నుంచి కూడా ప్రోత్సాహం లభించేది అతి తక్కువ మంది మహిళలకే. ఈ పరిస్థితుల్లో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలంటే అడుగడుగునా సవాళ్లే. అయినప్పటికీ వీటిని అధిగమించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. వారికి కావాల్సిందల్లా ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకం. ఆలోచనను అమల్లో పెట్టాలంటే కీలకపాత్ర నిధులదే అయినప్పటికీ అంతకుమించిన పాత్ర శిక్షణది. ఒక ఆలోచనను విజయవంతంగా కార్యరూపంలో పెట్టాలంటే సంబంధిత రంగానికి సంబంధించిన పూర్తి వివరాలు అధ్యయనం చేయాలి. టెక్నాలజీ, న్యాయపరమైన అంశాలకు సంబంధించి ప్రత్యేకంగా శిక్షణ ఉండాలి. విజయవంతమైన పరిశ్రమలు సందర్శించేలా, పారిశ్రామికవేత్తలను కలిసి తమ అనుమానాలు నివృత్తి చేసుకునేలా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్రభుత్వం అవకాశం కల్పించాలి. ప్రభుత్వాల దృష్టి నిధుల కేటాయింపు పై వరకే పరిమితమవుతోంది. స్టార్టప్‌లు ఎందుకు విఫలమవుతున్నాయి.? లోపాలేమిటన్న విషయాలపై దృష్టి సారించకపోవడం అతిపెద్ద లోపం. కొత్తవారికి ఆర్థిక సహకారంపై దృష్టి సారిస్తున్న ప్రభుత్వాలు కార్యకలాపాలను ప్రారంభించిన సంస్థలకు సహకారం అందించేందుకు సిద్ధంగా లేవు. జిఇఎస్ సదస్సు నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలకమైన ఈ అంశాలపై దృష్టి సారించి లోటుపాట్లను సరిదిద్దాలి.

దివ్య లోచన, సిఇఒ, డిఎల్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్
- **వ్యాపారం:** ఆహార ఉత్పత్తులు, వస్త్రాలు ఎగుమతి, దిగుమతులు
- **చిరునామా :** జూబ్లీహిల్స్

GLOBAL ENTREPRENEURSHIP SUMMIT INDIA 2017

ఇన్వెస్టర్లు కలుస్తారన్న ఆశతో ఉన్నా..

పారిశ్రామికవేత్తల అంతర్జాతీయ సమావేశం హైదరాబాద్‌లో నిర్వహిస్తుండటం రాష్ట్రానికే గర్వకారణం. ఇప్పటికే దేశం మొత్తంలో స్టార్టప్ కల్చర్ వేగవంతంగా పెరుగుతోంది. ఈ తరుణంలో మరింత మంది విద్యార్థులు, యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఈ సదస్సు దోహదపడుతుంది. అమెరికా నుంచి అనేక మంది పారిశ్రామికవేత్తలు హాజరవుతున్నందున వారినుంచి స్ఫూర్తి పొందే అవకాశం లభించనుంది. ఈ సదస్సులో పాల్గొంటున్నందున ఇన్వెస్టర్లతో పరిచయాలు ఏర్పడి మా కంపెనీ అభివృద్ధికి దోహదపడుతాయన్న ఆశతో ఉన్నాను. దేశంలో అనేకమంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కృతనిశ్చయంతో ఉన్నా.. అనేక సమస్యలు వారిని లక్ష్యం వైపు వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. ఇందులో ప్రధానమైంది ఆర్థిక సహకారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టార్ట ప్‌ల కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కానీ వాటిని ఎలా పొందాలన్నదే పెద్ద సవాల్. ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు నైతం ఎవరికి, ఎంత ఇచ్చారు అన్న వివరాలు ఉండవు. నిధుల కేటాయింపు పారదర్శకంగా జరగటం లేదని నా భావన. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. అలాగే నిధులు కేటాయించమని వదిలేయకుండా స్టార్టప్‌లకు కావాల్సిన ఇతర సహకారాన్నీ అందించాలి.

అశ్విని నుస్స, కో ఫౌండర్, సిరప్ సొల్యూషన్స్
- **చిరునామా:** టి.హబ్, ఐఐఐటి క్యాంపస్, గచ్చిబౌలి, హైదరాబాద్
- **వ్యాపారం:** ఈ సంస్థ వాహనాల సేఫ్టీ, సెక్యూరిటీకి సంబంధించిన హైటెక్ ప్రొడక్ట్స్ తయారు చేస్తోంది. వెహికిల్ బ్లాక్ బాక్స్, స్మార్ట్ ఫ్లీట్ మేనేజ్‌మెంట్, ట్రాక్‌డ్... వంటి ప్రొడక్ట్స్‌ను డిజైన్ చేసింది.